## క్లుప్తంగా

### ఆలయంలో శ్రావణ నక్షత్రం పూజలు



గుండుగొలనులో స్వామివారికి పూజలు చేస్తున్న నిర్వాహకులు, పూజారులు

భీమడోలు: భీమడోలులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నేత వగ్వాల అచ్యుతరామారావు ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేక పూజలు, శాంతి హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, సాయి పవన్ ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శంకరరావు, పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### తెరుచుకున్న పాతూరు రైల్వే గేటు



పాతూరు రైల్వే గేటు నుంచి ప్రయాణికుల రాకపోకల పునరుద్ధరణ

భీమడోలు: జాతీయ రహదారికి పక్కనే ఉన్న పాతూరు రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతులు పూర్తి కావడంతో సంబంధిత అధికారులు గేటును మంగళవారం మధ్యాహ్నం నుంచి తెరిచారు. దీనితో గేటు మీదుగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులోని రైల్వే ట్రాక్‌ను ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు అత్యవసర మరమ్మతుల నిమిత్తం మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. వర్షాలు, సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఆ పనులు 29వ తేదీ ఉదయం వరకు కొనసాగాయి. సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడంతో గేటు తెరుచుకుంది. దీనితో రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

### ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



గుండుగొలనులో స్వామి వారి పవిత్రోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

భీమడోలు: గుండుగొలనులోని సీతారామ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రితో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ముగిసాయి. తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న తరహాలో ఇక్కడ 51 ఏళ్లుగా పవిత్రోత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. నాలుగురోజులుగా కన్నుల పండువగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ ఫౌండర్ కొండా గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజారి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. ఆలయంలో ప్రధాన హోమపూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

### 8 కుటుంబాలకు విద్యుత్, తాగునీటి సౌకర్యం

దెందులూరు: స్థానిక సీతంపేట కాల్వపై నివసిస్తున్న ఎనిమిది కుటుంబాలకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇప్పటి వరకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక ఎనిమిది కుటుంబాల గత కొన్నేళ్ల నుంచి నానా ఇబ్బందులుపడ్డారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మంగళవారం తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్ఫూర్తితో సీతంపేట వాసులకు కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్ కల్పించడం సంతోషంగా ఉందని ఏసుబాబు అన్నారు.

### సమష్టి కృషితోనే సత్ఫలితాలు

దెందులూరు: స్థూల నమోదు నిష్పత్తి నూరు శాతం లక్ష్యసాధనకు ఉద్యోగులందరూ కృషి చేయాలని అతిముఖ్యమని ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన హెచ్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లతో మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లలోపు యువత, చిన్నారుల వివరాలు సేకరించి, బడి బయట ఉన్న వారి వివరాలతో కూడిన అంశాలతో నివేదిక అందించాలని ఎంపీడీవో అన్నారు. ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే సత్ఫలితాలు లభిస్తాయని, ప్రణాళికబద్ధంగా అందరూ కృషి చేయాలని, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేయాలన్నారు.

# తెలుగు భాషాభివృద్ధికి గిడుగు అవిరళ కృషి

- డైమండ్స్ లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధి ఉమామహేశ్వరరావు
- ఘనంగా జాతీయ తెలుగు భాషాదినోత్సవం
- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



భీమడోలు: విజేతలకు బహుమతులు అందిస్తున్న టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్



దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

భీమడోలు: తెలుగు భాష అభ్యున్నతికి తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి సేవలను మరవలేనివని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు శాఖా గ్రంథాలయం, పాతూరు ప్రాథమిక పాఠశాల, అన్నేవారిగూడెం యూపీ పాఠశాలల్లో మంగళవారం జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పద్మభూషణ్, హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైమండ్స్ లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధి తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, టీచర్ పి.లక్ష్మీనారాయణ పాల్గొని తెలుగు భాష దినోత్సవ విశిష్టతను వివరించారు. అన్నేవారిగూడెంలో క్రీడాదినోత్సవంలో భాగంగా హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో క్రీడా జెండాలతో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. తెలుగు టీచర్ దుర్గాప్రసాదినిని సత్కరించారు. గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన, పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. అన్నేవారిగూడెంలో జరిగిన పరుగుపందెం, శతక పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎం పి.నిర్మలకుమారి, టీచర్లు మండే సుధాకర్, విజయకుమారి, స్వర్ణలత, ఎం.రవిభారతి, జ్యోతిబసు, శారారాణి, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో..**

పెదవేగి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక వంగూరులోని జేజే కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో, భోగాపురం విజ్ఞాన్ వరల్డ్ పాఠశాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ హెన్రీ డొమినిక్ మాట్లాడుతూ విద్యార్థులలో సర్వతోముఖాభివృద్ధి సాధించాలి అంటే మాతృభాషలో విద్య ఎంతో ముఖ్యమని తెలియజేశారు. భోగాపురం విజ్ఞాన్ గ్లోబర్ వరల్డ్ పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో విద్యార్థులు అలరించారు.

దెందులూరు: తెలుగుభాష ఔన్నత్యానికి, విస్మృతికి ఉద్యమంలా కృషి చేసిన మహోన్నత వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం మరీదు మనోహర్ అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో రామ్మూర్తి జయంతి వేడుక, తెలుగు భాష దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి తెలుగు ఉపాధ్యాయులు ఆకుల శ్రీనివాస్, హేబేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



అన్నేవారిగూడెంలో క్రీడాదినోత్సవంలో భాగంగా ర్యాలీ, ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

**తెలుగు భాషకు ప్రపంచ గుర్తింపు**

గణపవరం: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తికి సేవలను కొనియాడారు. గిడుగు జయంతి సందర్భంగా నిర్వహించిన కవితలు, సామెతలు, తెలుగు పద్యాలు, లేఖా రచన, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో పుచ్చకాయల రాజేశ్వరమ్మ, శేషమ్మ ట్రస్టు చైర్మన్ పుచ్చకాయల బ్రహ్మాజీరావు, వైస్ ప్రిన్సిపల్ మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, అనూరాధ, స్వరూపరాణి పాల్గొన్నారు.

### 2కే రన్‌లో గణపవరం విద్యార్థికి రెండోస్థానం



తణుకులో బహుమతి అందుకుంటున్న యశోదకృష్ణ

గణపవరం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి 2కే రన్ పరుగుపందె పోటీలో గణపవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి యశోదకృష్ణ ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు, విద్యార్థికి ప్రశంసా పత్రం, మెడల్, బహుమతులు అందజేశారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పీడీ పి.పద్మావతిని హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

### నేడు పోతునూరులో గడపగడపకు..

దెందులూరు: పోతునూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలనవకాంతం, సర్పంచ్ బోదుల స్వరూప్, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. మూడున్నరేళ్లల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు ఎమ్మెల్యే కొఠారు వివరించి వారు సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొనాలని సర్పంచ్ బోదుల స్వరూప్ కోరారు.

## సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకు ప్రభుత్వ పాలన

- చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



చేబ్రోలులో మహిళలకు పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వ పాలన ప్రజల చెంతకు వచ్చిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం చేబ్రోలులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగాలో వాసుబాబు మాట్లాడుతూ వ లంటీరు వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు త్వరితగతిన పూర్తవుతోందన్నారు. సచివాయాల్లోని ఉద్యోగులు ప్రజలకు త్వరితగతిన సేవలందిస్తున్నారని అన్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ నిజం చేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక నియోజవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వాసుబాబు ప్రజలకు తెలియజేశారు. ఇంటింటికీ వెళ్లి బ్రోచర్ల అందించి ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీలు రాయిలక్ష్మి, మనసాల నాగమణి, కోఆప్షన్ సభ్యుడు షాజహాన్, నాయకులు కరణం బుజ్జి, ముత్తా బుజ్జి, యెలిశెట్టి పాపారావు, గంటా లక్ష్మణరావు, బాబ్జి, మాణిక్యం, దుబాకుల లోవరాజు, కొరపాటి నాగేంద్ర, పెంటు సాహెబ్ పాల్గొన్నారు.

## చదువు ద్వారా ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

పెదవేగి : పెదవేగి మండలంలో వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని డ్రాప్ ఎన్రోల్ మెంట్ పథకం ద్వారా నూరు శాతం తిరిగి బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పెదవేగి ఎంపీడీఓ గంజి రాజ్‌మనోజ్ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఎంపీడీఓ వెల్ఫేర్ అసిస్టెంట్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామాల వారీగా ఉన్న డ్రాపవుట్స్ వివరాల నివేదికల రూపంలో అందజేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. డ్రాపవుట్స్ నివేదికను పునః పరిశీలించి ఖచ్చితమైన రిపోర్ట్‌ను రూపొందిస్తామని చెప్పారు. డ్రాపవుట్స్‌గా గుర్తించిన వారిని తిరిగి బడిలో చేర్పించడం లేదా వారికి ఇష్టమైన స్కిల్స్ నేర్పించడం, ఓపెన్ స్కూళ్లలో చేర్పించి వారందరికీ ఉజ్వల భవిష్యత్ కల్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీఓ అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇద్దరు ఎంఈఓతో సమన్వయం చేసుకుని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ పర్యవేక్షించారు.

## కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలని ఆందోళన



దోసపాడు చెరువు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది

దెందులూరు: దోసపాడు చేపల చెరువుల వద్దకు చేరుకుని మంగళవారం దళితులు కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దోసపాడులోని చెరువుల్లో తమకు హక్కు ఉన్న భూముల్లో చేపలను పట్టుకోనివ్వాలంటూ మంగళవారం చెరువుల్లోకి దిగి చేపలను పట్టుకున్నారు. చెరువులకు గండ్లు కొట్టారు. ఎన్నో ఏళ్లుగా తమకు న్యాయం చేస్తారని అధికారులు, ప్రజాప్రతినిధులు వద్దకు తిరిగి తిరిగి ఆలసిపోయామని వ్యవసాయ సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి పీ.వెంకట్ అన్నారు. విషయం తెలుసుకున్న దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు నిర్వహించారు. శాంతిభద్రతల సమస్యలు సృష్టించవద్దని హితవు పలికారు. వ్యవసాయ కార్మిక సంఘం దోసపాడు దళితులకు మద్దతు ప్రకటించారు. జిల్లా నాయకులు పీ.రామకృష్ణ, జాన్‌రాజు, నాగేంద్ర, పవన్‌కుమార్, మణి, మాణిక్యం, గౌరి, శ్రీను పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి



పెదపాడు : జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్



దెందులూరు : గోపన్నపాలెం వ్యాయామ కళాశాలల మాట్లాడుతున్న జిల్లా యూత్ ఆఫీసర్ డీ కిషోర్

పెదపాడు: చిన్నారులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తే సంపూర్ణ మూర్తిమత్వం సిద్ధిస్తుందని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. మండలంలోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం భాషోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి, ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు తెలుగు భాషను చేరువ చేయడానికి కృషి చేసిన మహనీయుడు గిడుగురామ్మూర్తి అని కొనియాడారు. తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్, పద్య పఠనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ పీఎల్ నాయుడు, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖరర్‌రావు సంస్కృత ఉపాధ్యాయుడు జీ పద్మావతి, స్వాతిని సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

**ధ్యాన్‌చంద్ క్రీడారంగానికి ఆదర్శప్రాయుడు**

దెందులూరు: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడారంగానికి ఆదర్శప్రాయుడని జిల్లా యూత్ ఆఫీసర్ డీ.కిషోర్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

## వేద విద్యార్థులకు పరీక్షలు

గణపవరం: గణపవరం గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లోని వేద పాఠశాలల్లో వేద విద్యను అభ్యసించిన వేద విద్యార్థులకు ఏటా గణపవరం సఖ్యాభివర్ధక నిలయంలో వేద పరీక్షలు నిర్వహించడం శతాబ్దకాలంగా ఆనవాయితీ. ఇక్కడి పరీక్షలలో ప్రతిభ చూపిన వారికి ఇచ్చే ఉత్తీర్ణతా పత్రాలకు మంచి గుర్తింపు ఉంటుందన్న భావనతో దేశ నలుమూలల నుంచి వేద విద్యార్థులు ఇక్కడ నిర్వహించే పరీక్షలకు హాజరవుతుంటారు. పేరొందిన ఘనాపాఠీలు విద్యార్థులకు నాలుగు వేదాలలో పరీక్షలు నిర్వహిస్తారు. గణపవరం సఖ్యాభివర్ధక నిలయం టీటీడీ కల్యాణ మండపంలో మూడు రోజులుగా వేద విద్యార్థులకు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి రాఖీ పండుగ రోజున సర్టిఫికెట్లు అందజేస్తారు. వేదపండితులను సన్మానించి, ప్రోత్సాహకాలను గణపవరానికి చెందిన ప్రముఖ దాత, ఆధ్యాత్మికవేత్త సాగిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులు అందజేస్తారు.

## టీటీడీ బోర్డు సభ్యుడు పెదబాబుకు అభినందనల వెల్లువ



పెదబాబును సత్కరిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



పెదబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాపాక, రుడా చైర్మన్ షర్మిల

నిడమర్రు: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా నియమితులైన గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు)కు మంగళవారం పలువురు ప్రముఖులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ తిరుమల వెంకన్నకు సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కొత్త బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆయన తెలిపారు. పెదబాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసరావు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ (రుడా) చైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి తదితరులు న్నారు.

పెదబాబును సత్కరించిన జెడ్పీటీసీ కోడే కాశి

నిడమర్రు: టీటీడీ బోర్డు సభ్యునిగా నియమితులైన గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు)ను మంగళవారం నిడమర్రు జెడ్పీటీసీ కోడే కాశి, పెదనింద్రకొలను వైసీపీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం 200వ రోజు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం పెదనింద్రకొలనులో నిర్వహించే కార్యక్రమానికి పెదబాబును ఆహ్వానించామని కోడే కాశి తెలిపారు. సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, ఎంపీటీసీ చినిమిల్లి నరసింహులు, పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఉండ్రాజవరం రోడ్డు నిర్మాణం ప్రారంభం

దెందులూరు: ఉండ్రాజవరం రోడ్డును రూ. 20 లక్షల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్టు దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు.మంగళవారం రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. దోసపాడు, పోతునూరు, ఉండ్రాజవరం, కొవ్వలి, గుండుగొలను గ్రామ ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేశారని, ఎంపీపీ సుమలత, సర్పంచ్ స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎన్ ప్రసాద్ (బజ్జి) అన్నారు. ఎంపీటీసీ సున్నా నరేష్, సచివాలయ కన్వీనర్ సున్నా ఫణి, ఎరుబోయిన సింహాచలం, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ పాల్గొన్నారు.

## క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం




గణపవరం డిగ్రీకాలేజీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: క్రీడలు మానసిక శారీరక వికాసానికి దోహదపడతాయని, చిన్నతనం నుంచి ప్రతి ఒక్కరికీ క్రీడలలో ప్రవేశం ఉండాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో నిర్వహించిన క్రీడా దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపల్ నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. సభలో వాసుబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో యువతీయువకులకు క్రీడా సదుపాయాలను కల్పిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారవుతారని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్టేడియంను నిర్మించాలన్న ఆలోచన ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రాథమిక స్థాయినుంచే విద్యార్థులకు క్రీడలలో పాల్గొనే అవకాశం కల్పించాలని, ప్రతి పాఠశాలలో విధిగా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడలలో ముందంజలో ఉన్న విద్యార్థులు చదువులోనూ ముందుంటారని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని, విద్య, ఉద్యోగాలలో మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కాకర్ల శ్రీను, జిల్లా కార్యదర్శి నడింపల్లి సోమరాజు, విశ్రాంత పిడి ఆదిరెడ్డి సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దండు రాము, సర్పంచ్ మూర అలంకారం ,వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రొంగల శ్రీను, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.